సాక్షి
నాగర్‌కర్నూల్
సోమవారం। 2। జనవరి। 2023



ఆదరణ కరువు
జిల్లాలోని చారిత్రక ఆలయాలు ఆదరణకు నోచుకోక మరుగున పడుతున్నాయి.
వివరాలు 8లో ▸



'మయూర' సందడి
నూతన సంవత్సరం సందర్భంగా మయూరి ఎకో అర్బన్ పార్కు సందడిగా మారింది.
వివరాలు 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /18.0

వాతావరణం
రోజంతా ఆకాశం సాధారణంగా ఉంటుంది. మంచు కురవొచ్చు. రాత్రివేళలో చలి తీవ్రత తక్కువగా ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్‌తోనే ప్రగతి: ఎంపీ రాములు

వంగూరు: రాష్ట్రంతో పాటు దేశంలో బీఆర్‌ఎస్‌తోనే ప్రగతి సాధ్యమవుతుందని నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు రాములు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నిజాంబాదలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడ్డాయని అన్నారు. ప్రధానంగా రైతుల సమస్యల పరిష్కారం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేశారని అన్నారు. గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ సురేష్ యాదవ్ తల్లి ఇటీవల మృతిచెందడంతో ఆమెకు ఎంపీ రాములు నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నారాయణరావు, అరవింద్‌రెడ్డి, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు లీగల్ సర్వీసెస్ అథారిటీ భవనం ప్రారంభం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు ఆవరణలో లీగల్ సర్వీసెస్ అథారిటీ భవన సముదాయాన్ని వర్చువల్ విధానం ద్వారా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ ప్రారంభించనున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజేష్ బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ భవన సముదాయాన్ని ఉదయం తొమ్మిదిన్నర గంటలకు ప్రారంభించనున్నట్లు వివరించారు.

చిన్నరాజమూరు హుండీ ఆదాయం రూ.7.78 లక్షలు



దేవరకద్ర: మండలంలోని చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి ఆలయంలో హుండీని లెక్కించగా రూ.7.78 లక్షల ఆదాయం వచ్చిందని దేవస్థానం ఈఓ ప్రసాద్ తెలిపారు. ఇటీవల స్వామివారి బ్రహ్మోత్సవాలు, జాతర ముగియడంతో భక్తులు హుండీలో వేసిన నగదును ఆదివారం లెక్కించారు. ఈ మేరకు నగదును బ్యాంకులో డిపాజిట్ చేస్తామని ఆయన తెలిపారు. అలాగే ఆంజనేయస్వామి ఆలయం వద్ద నూతన సంవత్సరం సందర్భంగా భక్తుల సందడి కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు.

జాతీయస్థాయి నృత్య పోటీలకు వనపర్తి విద్యార్థి

వనపర్తిటౌన్: జాతీయస్థాయి కళాఉత్సవ్ కూచిపూడి నృత్య పోటీలకు జిల్లాకేంద్రంలోని బాలభవన్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థి రాత్లావత్ నరేష్ ఎంపికైనట్లు శిక్షకురాలు లక్ష్మీప్రసన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలో విజేతగా నిలిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడని.. ఒడిశా భువనేశ్వర్‌లో ఈ నెల 3, 4, 5 తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఆదివారం బయలుదేరినట్లు పేర్కొన్నారు.

మూడు క్వార్టర్లు.. ఆరు బీర్లు

తగ్గేదే లే..!

ఉమ్మడి జిల్లాలో రికార్డు స్థాయిలో అమ్మకాలు

- రెండు రోజుల్లో రూ.40.30 కోట్ల మద్యం తాగేశారు
- డిసెంబర్ నెల రోజుల్లోనే రూ.245.50 కోట్ల వ్యాపారం
- ఇటు వ్యాపారులు.. అటు ప్రభుత్వానికి కాసుల పంట
- డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 43 మంది వాహనదారులు



మహబూబ్‌నగర్ క్రైం: డిసెంబర్ 31 వేడుకలు అంటే మాములుగా ఉండవని మరోసారి నిరూపించారు. ఈ వేడుకల కోసం అటు వ్యాపారులు.. ఇటు మందుబాబులు ఎంతో ఎదురుచూస్తుంటారు. అలాంటిది రెండు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో రికార్డు స్థాయిలో మద్యం విక్రయాలు జరిగాయి. చలి ఉన్న నేపథ్యంలో మందుబాబుల పార్టీలకు అంతే లేకుండా పోయింది. శనివారం జరిగిన డిసెంబర్ 31 వేడుకలతోపాటు ఆదివారం జరిగిన న్యూ ఇయర్ వేడుకల్లో మద్యం జోష్ కనిపించింది. గతంలో కంటే ఈసారి మద్యం అమ్మకాలు కొంత పెరిగి.. మూడు బీర్లు.. ఆరు క్వార్టర్లు అన్నట్టుగా సాగింది. ఫలితంగా ఉమ్మడి జిల్లాలో డిసెంబర్ 31తోపాటు ఆదివారంతో కలిపి రూ.40.30 కోట్ల మద్యం విక్రయించారు. అమ్మకాలు భారీగా ఉండటంతో.. శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు దుకాణాలు, ఒంటిగంట వరకు బార్లు కొనసాగాయి. అయితే గతేడాది కంటే ఈసారి ఐఎంఎల్ 14 శాతం తగ్గినా.. ఆదాయం మాత్రం పెరిగింది. ఉమ్మడి పరిధిలో మహబూబ్‌నగర్ టౌన్, జడ్చర్ల, నారాయణపేట, కొత్తకోట, గద్వాల, నాగర్‌కర్నూల్‌లో మద్యం అధికంగా అమ్మకాలు జరిగాయి.

మహబూబ్‌నగర్‌లోనే అధికం..

2022 ఏడాది డిసెంబర్ 31 వేడుకల్లో భాగంగా శనివారం ఒక్కరోజు రాత్రి ఐఎంఎల్ 19,104 కేసులు, బీర్లు 12,695 కేసుల విలువ చేసే రూ.17.84 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఇందులో మహబూబ్‌నగర్ పట్టణంలో రూ.3.01 కోట్ల మద్యం అమ్మారు. ఆ తర్వాత జడ్చర్లలో రూ.2.56 కోట్లు, కల్వకుర్తిలో రూ.1.83 కోట్లు, వనపర్తిలో రూ.1.56కోట్లు, నారాయణపేటలో రూ.1.34 కోట్లు, నాగర్‌కర్నూల్‌లో రూ.1.10 కోట్ల అమ్మకాలు జరిగాయి. ఆదివారం రూ.22.16 కోట్ల మద్యం విక్రయించారు. జిల్లాలో మద్యం అమ్మకాలు తారాస్థాయికి చేరుతున్న తరుణంలో కిక్కిచ్చే ఓ రోజు మద్యంప్రియుల సొంతమైంది. మద్యం డిపో నుంచి కొనుగోలు చేసిన మద్యంతోపాటు దుకాణాల్లో స్టాక్ ఉన్న మద్యం కూడా భారీ స్థాయిలో అమ్మకాలు జరిగాయి.

ఉమ్మడి జిల్లాలో గత మూడేళ్ల (డిసెంబర్)లో మద్యం విక్రయాలు, ఆదాయం ఇలా..

ఏడాది	ఐఎంఎల్ (కేసులు)	బీర్లు	ఆదాయం (రూ.కోట్లలో..)
2020	2,23,606	1,90,130	207.74
2021	2,98,154	2,46,077	241.69
2022	2,55087	2,79,793	245.50



దుకాణాలు, హోటళ్లు కిటకిట..

ఆదివారం జరిగిన న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా మహబూబ్‌నగర్‌లో మటన్, చికెన్ దుకాణాలతోపాటు రెస్టారెంట్లు, ప్రధాన హోటళ్లు కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రధాన హోటళ్లు అయితే రద్దీగా కనిపించాయి. దీంతోపాటు బేకరీలు సైతం కొనుగోలుదారులతో నిండిపోయాయి. ఉమ్మడి జిల్లాలో మద్యం, మాంసం విక్రయాలు, బేకరీ పదార్థాలు కలిపి ఈ రెండు రోజుల్లో దాదాపు రూ.వంద కోట్లకుపైగా వ్యాపారం జరిగి ఉంటుందని అంచనా.

ఆదాయం పెరిగింది..

2022 డిసెంబర్ నెలలో మద్యం దుకాణాలు కొత్తగా ఏర్పాటు చేయడం వల్ల డిపోల నుంచి స్టాక్ ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేశారు. 2021తో పోల్చితే 2022 డిసెంబర్‌లో 14 శాతం ఐఎంఎల్ అమ్మకాలు తగ్గాయి. కాకపోతే డిసెంబర్ నెలలో జరిగిన మద్యం విక్రయాలతో మొత్తంగా ఆదాయం మాత్రం స్వల్పంగా పెరిగింది.

– దత్తరాజ్‌గౌడ్, డీసీ

అర్ధరాత్రి వరకు కిటకిట

పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ.. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో బార్లు, మద్యం దుకాణాలు మద్యం ప్రియులు, కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. అర్ధరాత్రి ఒంటిగంట వరకు బార్‌లకు అనుమతి ఉండటం వల్ల అమ్మకాలు పెరిగాయి. మద్యం డిపో గత నాలుగు రోజుల నుంచి కొనుగోలు చేసే వ్యక్తులతో బిజీబిజీగా ఉంది.

నేడు వైకుంఠ ఏకాదశి



రంగనాయక స్వామి దేవాలయాన్ని సుందరంగా ముస్తాబు చేసిన నిర్వాహకులు

కందనూలు: జిల్లాలోని అత్యంత పురాతన వైష్ణవ ఆలయమైన శ్రీపురం శ్రీరంగనాయక స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం తెల్లవారుజామున 5:30 గంటల నుంచి ఉత్తరద్వార దర్శనం ప్రారంభమవుతుంది. వైకుంఠ ఏకాదశి కోసం ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రంగురంగుల విద్యుద్దీపాలతో ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉత్తర ద్వారంతో పాటు ఆలయం మొత్తాన్ని పూలతో అలంకరించారు. శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో ఉత్తర ద్వారం వెంట వెళ్లి స్వామి వారిని దర్శించుకునేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలిరానుండటంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తగు ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున గరుడ సేవ, సేవాకాలం తదితర పూజల అనంతరం స్వామివారి దర్శనం కల్పించనున్నారు. ఉత్తర ద్వార దర్శనం కోసం కలెక్టర్ ఉదయ్ కుమార్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నేతలు హాజరుకానున్నారు.

బిజినేపల్లి: మండలంలోని పాలెం శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే వైకుంఠ ఏకాదశి స్వామివార్ల దర్శనం కోసం ఆలయంలో అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. స్వామివార్లకు, ఆలయ అలంకారం కోసం ఇప్పటికే అన్ని రకాల పూలు తెచ్చి ముస్తాబు చేశారు. దర్శనం కోసం భక్తులకు ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

ఎస్పీ మనోహర్



ఎస్పీ మనోహర్‌కు పూలబొకె అందజేస్తూ.. శుభాకాంక్షలు తెలియజేస్తున్న పోలీసు సిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం: నూతన సంవత్సరంలో పోలీసు సిబ్బంది అందరూ సమన్వయంతో పనిచేస్తూ.. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తూ.. జిల్లాను రాష్ట్రంలో ముందు స్థానంలో ఉంచాలని ఎస్పీ మనోహర్ ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మనోహర్ కేక్ కట్ చేసి పోలీసు సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు. గతేడాది జిల్లా పోలీస్ శాఖలో అందరూ సమన్వయంతో పని చేసి అన్ని వర్టికల్స్‌లో జిల్లాను రాష్ట్రంలో ముందు స్థానంలో ఉంచారని, ఈ ఏడాది కూడా జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ ఏడాది ఎన్నికలు వచ్చే అవకాశం ఉండటంతో పోలీసు సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ.. శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. జిల్లాలో ఫ్రెండ్లీ పోలీసింగ్‌ను అమలు చేయడంతో పాటు పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్, ఏఆర్‌ఏఎస్పీ భరత్‌తో పాటు డీఎస్పీలు, సీఐలు ఎస్‌ఐలు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తాం

పెద్దకొత్తపల్లి: వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇస్తే పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. కొల్లాపూర్ ప్రగతి కోసం పాదయాత్ర 25వ రోజు దేవల్‌తిరుమలాపూర్‌కు చేరుకుంది. ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామ ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. కొల్లాపూర్‌కు పారిశ్రామిక వాడ, మామిడి మార్కెట్, పెద్దకొత్తపల్లి మండల కేంద్రానికి ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం రైతుల వ్యవసాయ పొలాల వద్ద కూలీలతో కలిసి సుధాకర్‌రావు వరినాట్లు వేశారు. కార్యక్రమంలో జలాల్ శివుడు, భీమేశ్వర్‌రెడ్డి, వెంకటయ్య, నాగరాజు, లింగస్వామి, రాజు, శివ పాల్గొన్నారు.



దేవల్‌తిరుమలాపూర్‌లో కూలీలతో కలిసి వరినాట్లు వేస్తున్న ఎల్లేని సుధాకర్‌రావు

చదువుల తల్లి సావిత్రిబాయి పూలే



సావిత్రిబాయి పూలేకు నివాళి అర్పిస్తున్న కవులు

కందనూలు: చదువుకు నోచుకోని బడుగుబలహీన వర్గాల మహిళలకు పూర్వకాలంలోనే చదువు చెప్పి సమసమాజ మార్పునకు కృషి చేసిన ఆధునిక భారతీయ తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఎస్‌ఆర్ హైస్కూల్‌లో నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 192వ జయంతి సందర్భంగా కవి సమ్మేళనం నిర్వహించారు. సంస్థ ప్రధాన కార్యదర్శి వహీద్ ఖాన్ సభాధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. అనంతరం ఈ కవి సమ్మేళనాన్నికి ముఖ్యఅతిథిగా హాజరైన కృష్ణయ్య మాట్లాడారు. మహిళలు చదువుకొని అన్ని రంగాల్లో ముందుకు రావాలనే లక్ష్యంతో పెత్తందారి వ్యవస్థను దిక్కరించిన భారతీయ సంఘ సంస్కర్త అని కొనాయాడారు. అనంతరం కవి సమ్మేళనంలో 40 మంది కవులు, కవయిత్రులు సావిత్రిబాయి పూలే జీవితం, ఉద్యమంపై కవితాగానం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వనపట్ల సుబ్బయ్య, కందికొండ మోహన్, ఈశ్వరమ్మ, సువర్ణ, కల్వకోల్ మద్దిలేటి, ముచ్చర్ల దినకర్, ఎదిరెపల్లి కాశన్న తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు.. ప్రత్యేక పూజలు



జిల్లా కేంద్రంలోని సాయిబాబా మందిరంలో పూజలు చేస్తున్న భక్తులు



వట్టెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల క్యూ

కందనూలు: నూతన సంవత్సర మొదటి రోజును పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఆలయాలు కిటకిటలాడాయి. జిల్లాలోని ప్రధాన ఆలయాలు ఉమామహేశ్వరం, వట్టెం వెంకన్న, ఊర్కొండ ఆంజనేయస్వామి, సిర్సనగండ్ల రాములవారి సన్నిధి, మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ దేవాలయంతో పాటు జిల్లా కేంద్రంలోని పలు ఆలయాలు హౌసింగ్‌బోర్డు వేంకటేశ్వర దేవాలయం, అయ్యప్ప సన్నిదానం, మార్కెట్‌యార్డు శివాలయం భక్తులతో రద్దీగా మారాయి. పట్టణాలతో పాటు, గ్రామాల్లో మహిళలు తమ ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేశారు. రోజంతా కుటుంబసభ్యులతో ఉల్లాసంగా గడిపారు.

ఘనంగా కోరేగావ్ విజయదివస్



అచ్చంపేటలో కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: అంబేడ్కర్ ఐడియలాజి మిషన్ ఆధ్వర్యంలో 205వ బీమా కోరేగామ్‌విజయ దివస్‌ను ఆదివారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటి మాట్లాడారు. దేశ కులవ్యవస్థ దుర్మార్గపు అణచివేత, అంటరానితనం ముందు విముక్తి పొందడానికి మహర్ పీడిత కులానికి చెందిన 500 మంది సైనికులు జనవరి 1న ఈస్టిండియా కంపెనీ తరపున రెండో బాజీరావుతో కలిసి 2,800 మంది సైన్యంతో భీమా నది ఒడ్డున పోరాడి విజయం సాధించారని పేర్కొన్నారు. ఈ విజయానికి సూచికగా బ్రిటీష్‌వారు కోరేగావ్ వద్ద మహర్ అమరవీరుల స్తూపాన్ని నిర్మించి కోరేగావ్ యుద్ధంలో చనిపోయిన 22 మంది మహావీరుల పేర్లు చెక్కించారని సూచించారు. ఈ స్తూపాన్ని 1927 నుంచి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దర్శిస్తూ.. ఆ చరిత్ర ప్రపంచానికి తెలిపారన్నారు. వారి త్యాగాలతోనే దేశంలోని అట్టడుగు వర్గాల వారికి స్వేచ్ఛా, స్వాతంత్రాల పునాదులు ఏర్పడ్డాయన్నారు. సంఘం నాయకులు చంద్రయ్య, వెంకటస్వామి, గోవర్ధన్, ఈశ్వర్, సింగోటం, శ్రీను, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కల్లాలకు బ్రేక్..?

- ఉపాధి ద్వారా చేపట్టిన కల్లాల వివరాల సేకరణ
- ఇకపై వాటిని చేపట్టొద్దని ప్రభుత్వానికి కేంద్రం ఆదేశాలు
- నిధులు సైతం తిరిగివ్వాలని రాష్ట్రానికి సూచన
- తమకు సమాచారం రాలేదంటున్న అధికారులు



ఊర్కొండలో చేపడుతున్న కల్లాల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నాగర్‌కర్నూల్: ఉపాధి హామీ పనులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టిసారించింది. గతంలో మాదిరి ఉపాధి హామీ కింద చేపట్టిన కల్లాల నిర్మాణాలను ఇకపై చేపట్టవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఉపాధి హామీ కింద రైతుల కోసం చేపట్టిన కల్లాల నిర్మాణాలు నిలిచిపోనున్నాయి. పనులను నిలిపివేయడమే కాకుండా కల్లాలకు కోసం చెల్లించిన నిధులను సైతం తిరిగి చెల్లించాలని కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేయడం జరిగింది. అయితే క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని, పనులు కొనసాగుతున్నాయని, ఎవరు దరఖాస్తు చేసుకున్న యదావిధిగా నిర్మాణాలు చేపడుతామని అధికారులు చెబుతున్నారు. దీంతో కల్లాల నిర్మాణంపై స్పష్టత లేకుండాపోయింది. అయితే కేంద్రం ఇచ్చిన ఆదేశాల పట్ల ఇటీవల జిల్లాలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళనలు సైతం చేపట్టారు. దీంతో కేంద్రం కల్లాల నిర్మాణలను ఉపాధి హామీ నిధులతో చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేసినట్లు స్పష్టమవుతుంది.

జిల్లాలో నిర్మించిన కల్లాలు : 183	
ఒక్కో నిర్మాణానికి వ్యయం (కొలతలను బట్టి) రూ.80,000	ఖర్చు చేసిన నిధులు (సుమారు) : రూ.2 కోట్లు

జిల్లా పరిధిలో ఇలా..

జిల్లాలోని 461 గ్రామాల్లో 2,08,425 జాబ్‌కార్డులు ఉండగా.. 4,15,447 మంది కూలీలు పనిచేస్తున్నారు. గత రెండేళ్ల క్రితం ఉపాధి కోసం ఉపాధి హామీ పథకంలో రైతుల పొలాల్లో కల్లాల నిర్మాణం చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. కల్లాల కొలతలను బట్టి రూ.80 వేల వరకు నిధులు మంజూరు చేస్తుంది. జిల్లాలో వరితోపాటు మొక్కజొన్న, పత్తి వంటి పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. దీంతో రైతులు తమ పొలాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు ఈ కల్లాలు వినియోగించుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా పనులు పూర్తయ్యేలా పర్యవేక్షణకు సైతం అధికారులను నియమించారు. దీంతో రెండేళ్లలో జిల్లావ్యాప్తంగా 183 కల్లాలను పూర్తిచేయగా వీటికోసం రూ.2 కోట్ల వరకు ఖర్చు చేశారు. మరికొన్ని కల్లాలు నిర్మాణంలో ఉండగా కేంద్ర ప్రభుత్వం ప్రకటనతో రైతులు సందిగ్ధంలో పడిపోయే అవకాశం ఉంది. ఒక్క కల్లాల విషయంలోనే కాకుండా ఉపాధి హామీ కింద చేపట్టిన రైతువేదికలు, వైకుంఠధామాల వివరాలను సైతం కేంద్ర ప్రభుత్వం తీసుకున్నట్లు సమాచారం. ఒకవేళ కేంద్ర ఇచ్చిన ఆదేశాలు వాస్తవమై.. ఆదేశాలు అమలు చేస్తే రైతులు కొంత నష్టపోయే అవకాశం ఉంది. గతంలో కల్లాలు లేక రైతులు రోడ్లపైనే ధాన్యాన్ని ఆరబెట్టుకోవడంతో రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా లేకపోలేదు.

అనుమతులు ఇస్తాం..

కల్లాల నిర్మాణాలను ఉపాధి ద్వారా చేపట్టవద్దని మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. పనులు యదావిధిగా కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో పూర్తయిన కల్లాలకు సంబంధించి బిల్లులు పూర్తిగా చెల్లించడం జరిగింది. ఇకపై కల్లాల కోసం దరఖాస్తు చేసుకున్న వాటికి అనుమతులు ఇస్తాం.

– నర్సింగ్‌రావు, డీఆర్‌డీఓ

క్లుప్తంగా

పాముకాటుతో రైతు మృతి


చిన్నయ్య (ఫైల్)

తెలకపల్లి: పాముకాటుకు గురై ఓ రైతు మృతిచెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్ఐ సుదీర్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని గోలగుండానికి చెందిన కడెం చిన్నయ్య(55) ఆదివారం ఉదయం పొలం పనులు చేస్తుండగా.. పాము కాటుకు గురయ్యాడు. ఆయన దానిని గుర్తించక అస్వస్థతకు గురయ్యాడు. మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. తనకు ఇబ్బందిగా ఉందని, రాలేనని చెప్పడంతో కుటుంబసభ్యులు వెళ్లి ఇంటికి తీసుకొచ్చి, అక్కడి నుంచి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు అప్పటికే మృతిచెందినట్లు తెలియజేశారు. అతనికి భార్య తిరుపతమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వివరించారు.

ఆటో బోల్తా : తప్పిన ప్రమాదం



అచ్చంపేట రూరల్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం మధ్యాహ్నం ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. నిత్యం రద్దీగా ఉండే అంబేద్కర్ చౌరస్తాలో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఆటో డ్రైవర్ మద్యం తాగి ఉన్నాడని, చూస్తుండగానే ఆటో బోల్తా పడిందని స్థానికులు తెలిపారు. ఆటో మధ్యలో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను స్థానికులు బయటకు తీశారు. అలాగే చేదురుబావి తండా సమీపంలోని నక్కవాగు వద్ద ఓ యువకుడు బైక్‌పై అదుపు తప్పి కిందపడ్డాడు. రోడ్డు గుంతలమయంగా ఉండటంతో గుంతలను తప్పించబోయి బైక్‌పై నుంచి యువకుడు కింద పడటంతో తల, చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. రోడ్డు మరమ్మతు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

బాలిక అదృశ్యం

అలంపూర్: అలంపూర్ చౌరస్తాలో ఓ బాలిక(17) అదృశ్యమైన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఉండవెల్లి ఎస్ఐ బాలరాజు తెలిపారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. అలంపూర్ మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన బాలిక అలంపూర్ చౌరస్తాలో నివాసం ఉన్న తన బాబాయ్ ఇంట్లో పది రోజులుగా ఉంటుందని తెలిపారు. వాళ్ల చిన్నమ్మ బొంకురు గ్రామంలో ఉత్సవాలకు వెళ్లడం, బాబాయ్ చౌరస్తాలోని దుకాణానికి వెళ్లడంతో ఇంట్లో ఒంటిరిగా ఉన్నట్లు పేర్కొన్నారు. బాబాయ్ మధ్యాహ్నం ఇంటికి వెళ్లగా బాలిక కనిపించలేదు. దీంతో చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఈవిషయం తెలియడంతో బాలిక తల్లి ఉండవెల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

30 క్వింటాళ్ల పత్తి దగ్ధం

మల్దకల్: గుడిసెలో నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. దీంతో రూ.3లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు. ఆ వివరాలు... ఎల్కూరు గ్రామానికి చెందిన తెలుగు కిష్టమ్మ తమ ఏడెకరాల పొలంలో పత్తి సాగుచేశారు. దిగుబడిని తన గుడిసెలో నిల్వ ఉంచుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున గుడిసెకు ఉన్న విద్యుత్ తీగలకు షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో మంటలు చెలరేగాయి. గుడిసెలోని 30క్వింటాళ్ల పత్తి పూర్తిగా కాలిపోయింది. ఈ విషయాన్ని తహసీల్దార్‌కు తెలిపారు. ప్రభుత్వం బాధిత రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.



విహారయాత్రలో విషాదం

- కోయిల్‌సాగర్ కుడికాల్వలో పడి యువకుడు మృతి

కోయిల్‌కొండ: విహారయాత్రకు స్నేహితులతో కలిసివచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు కుడికాల్వలో పడి ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనయ్య తెలిపారు. ఆయన కథనం మేరకు.. పశ్చిమబెంగాల్‌కు చెందిన కొందరు యువకులు హైదరాబాద్‌లోని బంగారు దుకాణాల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆదివారం స్నేహితులతో కలిసి దేవాసిస్ మండల్ (17) కోయిల్‌సాగర్ చూసేందుకు వచ్చాడు. నలుగురు స్నేహితులతో కలిసి కుడికాల్వలో సరదాగా ఈత కొడుతుండగా నీటి ప్రవాహ వేగానికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. విషయం తెలుసుకొని సంఘటనా స్థలానికి చేరుకొన్న పోలీసులు కాల్వలో గాలించగా మృతదేహం లభించింది. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

చారిత్రక ఆలయాలకు ఆదరణ కరువు


పెంట్లవెల్లి మండలం జటప్రోల్‌లో మూక గుడులు

- ధూపదీప నైవేద్యాలకు తప్పని ఇబ్బందులు
- దేవాదాయశాఖ దృష్టి సారించాలని కోరుతున్న భక్తులు

కొల్లాపూర్: చారిత్రక ఆలయాలకు జిల్లాలో ఆదరణ కరువవుతుంది. ఆదాయం ఉన్న దేవాలయాలపై మాత్రమే దేవదాయశాఖ అధికారులు దృష్టిపెట్టి, మిగతా వాటిని గాలికి వదిలేస్తున్నారు. దీనితో పలు ఆలయాలు ధూపదీప నైవేద్యాలకు కూడా నోచుకోవడం లేదు. గతంలో ఎంతో ప్రాచుర్యం పొందిన ఆలయాలు ప్రస్తుతం భక్తులు లేక బోసిపోతున్నాయి.

పట్టించుకోని దేవాదాయ శాఖ..

జిల్లాలోని పలు ఆలయాలకు ఎంతో చరిత్ర ఉన్న సరైన ఆదరణ లేక వెలవెల బోతున్నాయి. కొల్లాపూర్ నియోజకవర్గంలోని మంచాలకట్ట వద్ద కృష్ణానది తీరాన శతాబ్దాల చరిత్ర కలిగిన రామతీర్థాలయం ఉంది. ఆ గుడిలో నిత్య ధూపదీపాలకు నోచుకోవడం లేదు. అమరగిరి సమీపంలో మునులు ప్రతిష్ఠించిన మల్లయ్యస్వామి గుడి పరిస్థితి కూడా ఇంతే. పెద్దకొత్తపల్లి మండలంలోని దేవల్‌తిర్మలాపూర్‌లో వేంకటేశ్వరస్వామి ఆలయానికి రెండో తిరుపతిగా ఒకప్పుడు పేరుండేది. క్రమంగా ఆ ఆలయం ఆదరణ కోల్పోతోంది. పెంట్లవెల్లి మండల కేంద్రంలోని శివాలయం, చిన్నంబావి మండలంలోని బెక్కెం సమీపంలో గల సూర్యదేవాలయం, పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామంలో గల శివాలయం, నందీశ్వర ఆలయం, నాగర్‌కర్నూల్ జిల్లాలోని నందివడ్డెమాన్‌లో ఆలయాలకు సరైన ఆదరణ లభించడం లేదు.

నిధుల లేవనే కారణంతో..

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు లేవు. భక్తులు సమర్పించే కానుకల ద్వారానే అభివృద్ధి చేసుకోవాల్సి ఉంది. భక్తుల తాకిడి అధికంగా ఉన్న ఆలయాలను దేవాదాయశాఖ పరిధిలో చేర్చుకుంది. వాటిలో మాత్రమే నిత్య పూజలు సాగుతున్నాయి. మిగతా ఆలయాల్లో ఉదయం, సాయంత్రం పూజలు కూడా గగనమే. సీజీసీ ప్రాతిపదికన ఆలయాల అభివృద్ధికి నిధుల కేటాయింపు సాగుతుంది. గడిచిన మూడేళ్ల కాలంలో జిల్లాలో ఏ దేవాలయానికి కూడా దేవాదాయశాఖ ద్వారా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు కాలేదు.

ప్రచారం చేపడితే..

ఉమ్మడి జిల్లాలో ఎన్నో ఆధ్యాత్మిక కేంద్రాలు ఉన్నాయి. వీటిలో నాగర్‌కర్నూల్ జిల్లాలోనే అధికం. కృష్ణానది తీరం వెంట శతాబ్దాల కాలం క్రితమే మునులు, రుషులు ఆలయాలు ప్రతిష్ఠించారు. ఈ ఆలయాలకు తగిన ప్రచారం కల్పిస్తే భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

అధికారులు చర్యలు చేపట్టాలి



ఉమ్మడి జిల్లాలోనే ఒకప్పుడు జటప్రోల్ జాతరకు ప్రత్యేక గుర్తింపు ఉండేది. నెల రోజుల పాటు సాగే ఈ జాతరకు వేలాది మంది వచ్చేవారు. ఇప్పుడు ఎటువంటి జాతర చేయడం లేదు. మదనగోపాలస్వామి ఆలయ వైభవం పూర్తిగా తగ్గిపోయింది. మూకగుడులను పరిరక్షించాలి. మంచాలకట్టలో రామతీర్థాలయం, మల్లేశ్వరంలో పురాతన ఆలయాలు ఉన్నాయి. పూర్వవైభవం తీసుకువచ్చేందుకు దేవాదాయశాఖ అధికారులు చర్యలు చేపట్టాలి.

– అశోకనంద, మల్లేశ్వరం

ప్రభుత్వం దృష్టి సారించాలి



చారిత్రక ఆలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దేవాలయాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఇతర ప్రాంతాల్లోని ఆలయాల అభివృద్ధికి కేటాయించాలి. ఆలయాల్లో అర్చకులను, ఇతర సిబ్బందిని నియమించడంతో పాటు, భక్తులకు కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయాలి. ఆలయాల అభివృద్ధికి ట్రస్టీలు కాకుండా భక్తులతోనే అభివృద్ధి కమిటీలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– సత్యనారాయణగౌడ్, కొల్లాపూర్

మదనగోపాలస్వామి ఆలయం..

సంస్థానాధీశుల కాలంలో జటప్రోల్ సమీపంలోని కృష్ణానది తీరంలో మదనగోపాలస్వామి ఆలయాన్ని నిర్మించారు. అద్భుతమైన శిల్పసంపద ఈ ఆలయానికి సొంతం. సురభి రాజ వంశస్తుల పాలనలో ఈ దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ప్రతి సంవత్సరం నెల రోజుల పాటు ఆలయం వద్ద జాతర సాగేది. బండలాగుడు పోటీలు నిర్వహించేవారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంతో ఆలయం నీటిలో మునిగిపోయింది. తర్వాతి కాలంలో ఆలయాన్ని జటప్రోల్ గ్రామంలో పునర్నిర్మించారు. కొన్నేళ్లపాటు పూజలు సాగాయి. కాలక్రమేనా ధూపదీప నైవేద్యాలు పెట్టేవారు కూడా కరువయ్యారు. రెండేళ్ల క్రితం దేవదాయశాఖ అధికారులు పూజారిని నియమించారు. మదనగోపాలస్వామి ఆలయంతో పాటు, సమీపంలోని పురాతన శివాలయంలో పూజలు నిర్వహిస్తున్నారు. భక్తుల రావడం మాత్రం పూర్తిగా తగ్గిపోయింది. జటప్రోల్‌లోనే ఉన్న అగస్త్యేశ్వర ఆలయం, 19 మూకగుడుల నిర్వహణను పట్టించుకునే వారే లేరు. మూకగుడుల్లో అసాంఘిక కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. గతేడాది ఆలయ దర్శనానికి వచ్చిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు స్థానికులు ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించి, ఆలయాన్ని అభివృద్ధి పర్చాలని విన్నవించారు.


జటప్రోల్‌లోని మదనగోపాల స్వామి ఆలయం

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

పలువురికి గాయాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం, ఆదివారం వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందగా.. పలువురు గాయపడిన సంఘటనలు చోటుచేసుకున్నాయి. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి..

వంగూరు: మండలంలోని పోల్కంపల్లికి చెందిన మీసాల వెంకటయ్య తన కుమారుడిని తీసుకుని బైక్‌పై వ్యవసాయ పొలానికి వెళ్లి తిరిగి ఇంటి వస్తున్నాడు. పోల్కంపల్లి నుంచి డిండిచింతపల్లి వైపు వెళ్తున్న శివ, మల్లేష్, మరొకరు పల్సర్ బైక్‌పై వెళ్తూ.. ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొట్టారు. దీంతో బైక్‌పై ఉన్న అశ్విన్(7) అక్కడికక్కడే మృతిచెందాడు. అశ్విన్ రెండో తరగతి చదువుతున్నాడు. మృతుని తండ్రి వెంకటయ్యకు కూడా గాయాలు కావడంతో 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

జాతీయ రహదారిపై మహిళ..

ఎర్రవల్లిచౌరస్తా: బనగానపల్లె డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శనివారం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరింది. ఈ క్రమంలో ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి పదో బెటాలియన్ పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్రక్కును వెనుక నుంచి బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న కర్నూల్ పట్టణానికి చెందిన మహమ్మద్‌బీకి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ప్రమాద సమయంలో బస్సులో డ్రైవర్‌తో పాటు కేవలం ఐదురుగు ప్రయాణికులు మాత్రమే ఉండటంతో మిగతా ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. మృతురాలి భర్త ఫకురుద్దీన్ ఫిర్యాదు మేరకు సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

ఇద్దరికి గాయాలు..

వంగూరు: మండలంలోని పోల్కంపల్లి గ్రామ శివారులోని సబ్‌స్టేషన్ వద్ద రోడ్డుపై వెళ్తున్న బైక్‌కు అడవి పంది తగలడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వెల్దండ మండలం కొట్రకి చెందిన చంద్రయ్య, శారద భార్యాభర్తలు బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నారు. అడవిపంది బైక్‌కు తగలడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలియజేశారు.

ట్రాక్టర్ అదుపుతప్పి వలస కూలి..

కేటీదొడ్డి: ట్రాక్టర్ అదుపు తప్పడంతో ఒకరు మృతిచెందగా, ఇద్దరు తీవ్రంగా గాయపడ్డిన సంఘటన మండలంలోని చింతలకుంట గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు కర్ణాటక రాష్ట్రం సరిహద్దులో బాయిదొడ్డిలోని థర్మల్ ప్లాంట్‌లో కూలీలుగా పనిచేస్తున్నారు. వీరు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి, తిరుగు ప్రయాణంలో ట్రాక్టర్‌పై వెళ్తున్నారు. చింతలకుంట గ్రామ శివారులో ట్రాక్టర్ అదుపుతప్పి పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. షేక్ ఎక్రం(34)పై ట్రాక్టర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు గాయపడగా.. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. సంఘటన స్థలానికి ఎస్ఐ వెంకటేష్ చేరుకుని పంచానామా నిర్వహించి, మృతదేహాన్ని గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలియజేశారు.


కేటీదొడ్డిలో సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటేష్

మామిడిలో సస్యరక్షణతో లాభాలు

అలంపూర్: ఈ ఏడాది మామిడి పంటలో పూత ఆశాజనకంగా ఉంది. మామిడి విదేశాలకు ఎగుమతి చేసుకోనే అవకాశాలు ఉండటంతో ధర ఎక్కువ పలికే అవకాశం ఉంటుంది. మామిడిలో పూత, పిందె ఎక్కువగా వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. పూతను, పిందెను నిలుపుకుని నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలంటే జాగ్రత్తలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

మామిడిలో పూల రకాలు

మామిడిలో ఉండే పూల గుత్తిల్లో రెండు రకాలు పుష్పాలు ఉంటాయి. ఒక రకం ద్విలింగ పుష్పాలు, రెండో రకం మగ పుష్పాలు. ప్రతి పూల గుత్తిలో రకాన్ని బట్టి 200 నుంచి 4వేల వరకు పుష్పాలు ఉంటాయి. ద్విలింగ పుష్పాలు రకాన్ని బట్టి మారుతూ ఉంటాయి. ఉదాహరణకు రుమాని రకంలో 0.74 శాతం, నీలం రకంలో 55 శాతం, లాంగ్రా రకంలో 69 శాతం, బంగనపల్లిలో 22 శాతం ద్విలింగ పుష్పాలు ఉంటాయి. ద్విలింగ పుష్పాలు మాత్రమే ఫలిదీకరణం చెంది పిందెలుగా ఏర్పడతాయి. మగ పూలు ఫలదీకరణంలో తోడ్పడి తర్వాత రాలిపోతాయి. ద్విలింగ పుష్పాలలో కూడా ఫలదీకరణంకు ముందే పలు కారణాల వలన రాలిపోతాయి. కొంత వరకు పూత, పిందె రాలడం సహజమే. అయిన వాటి తీవ్రతను బట్టి తగు జాగ్రత్తలు పాటించాలి.

పోషకాల యాజమాన్యం

మామిడి కాయలు అంగుళం పరిమాణం నుంచి భుజాలు ఏర్పడే వరకు చాలా త్వరగా పెరుగుతాయి. ఈ సమయంలో పోషకాలైన నత్రజని, పోటాష్‌ను తప్పక అందించాలి. నీటి వసతి ఉన్న పొలాల్లో చెట్టు వయస్సును బట్టి 500 గ్రాముల నుంచి కిలో వరకు, 300 గ్రాముల పొటాష్‌ను పిందెలు బాదం కాయ పరిమాణం ఉన్నప్పుడు వేసి నీరు పెట్టాలి. నీటి వసతి లేని తోటల్లో నీటిలో కరిగే ఎరువులైన పాలీఫీడ్, మల్టి-కె ఎరువులు లీటరు నీటికి 10 గ్రాముల చొప్పున కలిపి పిచికారీ చేయాలి.


పూత దశలో ఉన్న మామిడి

తేనె మంచు పురుగు ఆశించిన పూత

హార్మోన్ల యాజమాన్యం

హార్మోన్ల లోపం, సమతుల్యత దెబ్బతింటే పూత, పిందె బాగా రాలుతుంది. దీని నివారణకు ప్లానోఫిక్స్ మందును 5 లీటర్ల నీటిలో/మి.లీ కలుపుకొని పిచికారీ చేసుకోవాలి. ఈ మందును మోతాదుకు మించి పిచికారీ చేస్తే పిందె రాలిపోయే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తగా పిచికారీ చేసుకోవాలి.

భూమిలో తేమ.. నీటి యాజమాన్యం

ఎండాకాలం వలన భూమిలోని తేమ ఆవిరి అవడం వలన నీటి ఎద్దడికి గురై పూత, పిందె రాలిపోతుంది. అలాగే నీరు ఎక్కువగా పెట్టిన, వర్షం ఎక్కువగా పడిన పూత, పిందె ఎక్కువగా రాలిపోతుంది. గోలికాయ సైజు పిందె దశలో తేలికపాటి నీటి తడి ఇవ్వాలి. నిమ్మకాయ సైజు ఉన్నప్పుడు ఆ తర్వాత నెలకోసారి రెండు తడులు ఇవ్వాలి. దీని వలన కాయరాలడం తగ్గడంతో పాటు నాణ్యత పెరిగి కాయ పరిమాణం కూడా పెరుగుతుంది.

చీడ పీడలు

మామిడికి చీడ పీడలు పూత, పిందె దశలో ఆశించడం వలన పూత, పిందె బాగా రాలుతుంది. పురుగులు, తెగుళ్లను జాగ్రత్తగా గమనిస్తూ తగు చర్యలు తీసుకోవాలి.

తేనె మంచు పురుగు

పూత, పిందె దశలో ఈ పురుగు ఎక్కువగా ఆశించును. పిల్ల పురుగులు గుంపులుగా చేరి రసాన్ని పీల్చి వేయడం వలన పూత మాడిపోతుంది. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ అనే మందును తగిన మోతాదులో వాడుకోవాలి.

తామర పురుగులు

తామర పురుగులు రసాన్ని పీల్చడం వలన పూత రాలిపోతుంది. పిందె దశలో కాయపై గోకి రసాన్ని పీల్చడం వలన మచ్చలు ఏర్పడతాయి. ఇవి ఆశించిన కాయలపై మంగు ఏర్పడుతుంది. వీటి నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ, లీటరు నీటిని కలిపి పిచికారీ చేసుకోవాలి.

బూడిద తెగులు

ఆకులు, పూత, పిందెలపై తెల్లని బూడిద వంటి పొడి ఏర్పడుతుంది. తెగులు సోకిన పూత, పిందెలు రాలిపోతాయి. దీని నివారణకు పూత మొగ్గ దశలో హెక్సాకొనజోల్ మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

భక్తజనసంద్రం.. మన్యంకొండ


మన్యంకొండలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

- జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆదివారం భక్తజనసంద్రమైంది. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయం ముందున్న కోనేరు నుంచి గర్భగుడి వరకు భక్తులు దర్శనానికి బారులు తీరారు. కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ఆలయం పక్కనున్న శివాలయంలో కూడా భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చాలామంది భక్తులు దిగువ నుంచి కొండపైకి కాలినడకన చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. స్టేజీ సమీపంలోని శ్రీ అలివేలు మంగతాయారు ఆలయంలో కూడా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థాన చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాస రాజు, సూపరింటెండెంట్ నిత్యానందచారి, పాలకమండలి సభ్యులు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

కురుమూర్తిస్వామి ఆలయంలో..

చిన్నచింతకుంట: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని అమ్మాపురం శ్రీ కురుమూర్తిస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. అర్చకులు ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.


కురుమూర్తిస్వామి ఆలయంలో..

కిటకిటలాడిన బీచుపల్లి ఆలయాలు..



అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తుల బారులు.. సరస్వతీదేవి ఆలయంలో..

ఎర్రవల్లిచౌరస్తా: కొత్త సంవత్సరం సందర్భంగా ఆదివారం బీచుపల్లిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆయా ఆలయాల్లో ప్రధాన అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు ఉదయాన్నే బీచుపల్లికి చేరుకొని పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి శివాలయం, కోదండరామస్వామి, సరస్వతీదేవి ఆలయంతో పాటు అభయాంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంలో అభిషేకం, ఆకుపూజ, అర్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఆ ఇంట్లో కొత్త సంబురం

- 8 ఏళ్ల క్రితం తప్పిపోయిన భర్త రాకతో ఆనందం

మదనాపురం: అందరూ నూతన సంవత్సర వేడుకలు జరుపుకొంటున్న తరుణంలో ఓ కుటుంబం ఈ రోజే మాకు నిజమైన కొత్త సంవత్సర సంబురం అంటూ ఆనందబాష్పాలు రాల్చారు. ఎన్నో ఏళ్ల క్రితం తప్పిపోయిన తన భర్త ఇక లేడంటూ ఆశలు వదులుకొని బతుకుతున్న ఓ మహిళ.. ఒక్కసారిగా తన భర్తను చూసి ఆనందంలో ఉప్పొంగిపోయిన ఘటన మదనాపురం మండలంలోని నెలివిడిలో ఆదివారం చోటుచేసుకుంది. పూర్తి వివరాలిలా.. నెలివిడికి చెందిన కోట్ల తిరుపతయ్య (50), సుజాత భార్యభర్తలు. వీరిద్దరు బతుకుదెరువు కోసం కూలి పనులు చేసుకునేందుకు 2015లో కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాంకు వెళ్లారు. కొంత కాలం అక్కడ పనులు చేసుకుంటూ ఉన్నారు. అనుకోకుండా అక్కడి నుంచి భర్త తిరుపతయ్య కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు, బంధువులు ఆ చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా కనిపించలేదు. దాదాపు 8 ఏళ్ల తర్వాత ఆదివారం తిరుపతయ్య ఇంటికి రావడంతో భార్య పిల్లలు ఆనందంలో మునిగిపోయారు. తాను ఇంతకాలం విజయవాడ దగ్గర పని చేసుకుంటూ ఉన్నానని, ఇక నుంచి భార్యాపిల్లలతో ఉంటానని అతను చెప్పారు. ఇదిలాఉండగా, ఈ రోజు నా కుటుంబానికి నిజమైన పండుగని భార్య సుజాత సంతోషం వ్యక్తం చేశారు.


భార్య సుజాతతో భర్త శ్రీనివాసులు

క్లుప్తంగా...

ఇన్‌ఫార్మర్ నెపంతో యువకుడి హత్య

చర్ల: ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు శనివారం అర్ధరాత్రి ఒక యువకుడిని హతమార్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. బీజాపూర్ జిల్లా తెర్రం పోలీస్ క్యాంపు సమీపంలోని కుర్సాంపారా గ్రామానికి శనివారం అర్ధరాత్రి 10 మంది మావోయిస్టులు వచ్చారు. ఇంట్లో నిద్రిస్తున్న తాటి సంజయ్‌ను కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులు కొంత దూరం వారి వెంట వెళ్లగా.. సంజయ్‌తో మాట్లాడి పంపిస్తామని మావోయిస్టులు హామీ ఇచ్చారు. కానీ సంజయ్‌ను హతమార్చి మృతదేహాన్ని తెర్రెం–పెగడ గ్రామాల మధ్యలోని ప్రధాన రహదారిపై పడేశారు. మృతదేహం వద్ద మావోయిస్టు పార్టీ జేగురుగొండ ఏరియా కమిటీ పేరిట లేఖ వదిలి వెళ్లారు. ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరిస్తున్నందువల్లే సంజయ్‌ను హతమార్చామని, ఇన్‌ఫార్మర్లుగా ఎవరు వ్యవహరించినా ఇదే శిక్ష విధిస్తామని లేఖలో హెచ్చరించారు. ఈ సంఘటనను బీజాపూర్ జిల్లా ఎస్పీ ఆంజనేయ వర్షిణే ధ్రువీకరించారు. తెర్రెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొడుకుతో కొత్త ఏడాది వేడుకలు చేసుకుందామని వెళ్లి


తులసి దాస్, రాజమణి(ఫైల్)

నిర్మల్‌టౌన్: కొడుకు కుటుంబంతో కలిసి నూతన సంవత్సరం వేడుకలు జరుపుకుందామని వెళ్లిన వృద్ధ దంపతులను ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కబళించింది. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లిలో జరిగిన ఘటన నిర్మల్ జిల్లా కేంద్రంలో విషాదం నింపింది. నిర్మల్ శివారులోని బంగల్‌పేట్‌కు చెందిన తులసీదాస్(65), రాజమణి (60) దంపతులు. తులసీదాస్ పట్టణంలో చిన్న బొగ్గుల కొట్టు నడుపుతుంటాడు. పెద్ద కొడుకు నాగరాజు స్థానికంగా బంగారం షాపు నిర్వహిస్తుండగా, చిన్న కుమారుడు రాము హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇద్దరికీ పెళ్లిళ్లు చేశారు. రాము భార్య పిల్లలతో హైదరాబాద్ బోయిన్‌పల్లిలో ఉంటున్నాడు. తులసీదాస్, రాజమణి నిర్మల్‌లో పెద్ద కుమారుడి వద్ద ఉంటున్నారు. నూతన సంవత్సర వేడుకలకు పెద్దకుమారుడు అత్తవారింటికి వెళ్లడంతో దంపతులిద్దరూ హైదరాబాద్‌లో ఉంటున్న చిన్న కొడుకు వద్దకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఆదివారం ఉదయం బస్సులో హైదరాబాద్ వెళ్లారు. బోయిన్‌పల్లి వద్ద బస్సుదిగి రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన తులసీదాస్, రాజమణి అక్కడికక్కడే మృతిచెందారు.

కాటేసిన 'కానుక'

▶ మొదటి పేజీ తరువాయి

నలిగిపోతూ ప్రాణాలు అనంతవాయువుల్లో కలసిపోతున్నా చంద్రబాబు తీరు మారడం లేదు. ఏమాత్రం పశ్చాత్తాపం కానరావడం లేదు.

మంచినీళ్లూ ఇవ్వలేదు..

సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తామంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేసిన టీడీపీ నేతలు గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి పేద మహిళలను వికాస్ కాలేజీ మైదానానికి తరలించారు. టీడీపీ ఎన్ఆర్ఐ విభాగానికి చెందిన ఉయ్యూరు ఫౌండేషన్ ఎండీ ఉయ్యూరు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. చంద్రబాబు ఆదివారం మధ్యాహ్నం 4 గంటలకు వేదిక వద్దకు చేరుకుని స్వయంగా పేదలకు సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తారని షెడ్యూల్‌లో పేర్కొన్నారు. మధ్యాహ్నం 1 గంట నుంచే పేదలను తరలించగా చంద్రబాబు సాయంత్రం 5.30 గంటలకు వేదిక వద్దకు రావడం గమనార్హం. అప్పటికే దాదాపు ఐదు గంటలకుపైగా నిరీక్షించాల్సి రావడం, కనీసం తాగేందుకు నీళ్లు కూడా లేకపోవడంతో మహిళలు అల్లాడారు. అంత ఆలస్యంగా వచ్చినా చీరల పంపిణీని ప్రారంభించలేదు. చీరల పంపిణీ మొదలుపెడితే చంద్రబాబు ప్రసంగం వినేందుకు ఎవరూ ఉండరనే భయంతో టీడీపీ నేతలు వాటిని మహిళలకు అందించలేదు. సాయంత్రం 5.35 గంటలకు చంద్రబాబు ప్రసంగం ప్రారంభించి 6.15 గంటలకు ముగించారు. కొంత మందికి మాత్రం చంద్రబాబు సంక్రాంతి కానుకలు అందచేయగా మిగతావారికి టీడీపీ నేతలు ఇస్తారంటూ వెళ్లిపోయారు.

ఐదు నిమిషాల్లోనే...

అప్పటివరకు కానుకల పంపిణీ గురించి గొప్పగా చెప్పిన నిర్వాహకులు చంద్రబాబు నిష్క్రమించగానే మాట మార్చారు. నామమాత్రంగా కొందరికి అందించి చేతులు దులిపేసుకోవాలని భావించారు. మిగిలిన వారందరికీ డివిజన్లలోకి వచ్చి పంపిణీ చేస్తామని చెప్పడంతో మహిళలు నిర్ఘాంతపోయారు. కానుకల కోసం తోసుకుంటూ తూతూ మంత్రంగా ఏర్పాటు చేసిన బ్యారికేడ్లను నెట్టుకుంటూ ముందుకు కదిలారు. తోపులాటలో ఒకరిపై ఒకరు పడిపోయి తీవ్రంగా గాయపడ్డారు. ఘటనలో గుంటూరు కన్నావారితోటకు చెందిన సయ్యద్ ఆసియా (35), ఏటీ అగ్రహారానికి చెందిన గోపిదేశి రమాదేవి (50), మారుతీనగర్ నాయీబ్రాహ్మణ కాలనీకి చెందిన షేక్ బీబీ (55) తొక్కిసలాటలో ఊపిరి ఆడక మృతి చెందారు. వీరిలో ఒక మహిళ అక్కడికక్కడే మరణించగా మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో 16 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది.


మృతిచెందిన రమాదేవి, సయ్యద్ ఆసియా, ఎస్‌కే బీబీ

30 కౌంటర్లంటూ.. 12 లారీల్లో

చంద్రన్న సంక్రాంతి కానుకలను 30 కౌంటర్లు ఏర్పాటు చేసి పంపిణీ చేస్తామని టీడీపీ నేతలు పోలీసులకు సమాచారమిచ్చారు. కానీ కేవలం 12 మాత్రమే ఏర్పాటు చేశారు. అది కూడా కానుకలతో కూడిన లారీలను నేరుగా మైదానంలోకి తరలించి వాటి నుంచే పంపిణీ చేశారు. వాహనాలను దూరంగా కాకుండా దగ్గరగా ఇరుకుగా నిలబెట్టారు. చంద్రబాబు వెళ్లిపోయిన 5 నిముషాల్లోనే కానుకల పంపిణీని నిలిపివేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. దీంతో లారీలు కదలడానికి సిద్ధమవుతున్నాయని పసిగట్టిన పేదలు కానుకల కోసం ఒక్కసారిగా ఎగబడ్డారు. ఫలితంగా తొక్కిసలాటకు దారితీసి అమాయక మహిళలు మృత్యువాతపడ్డారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని, ఎమ్మెల్సీలు డొక్కా మాణిక్యవరప్రసాద్, లేళ్ల అప్పిరెడ్డి తదితరులు ప్రభుత్వాసుపత్రిలో బాధితులను పరామర్శించారు. చనిపోయిన వారికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున ప్రభుత్వం తరఫున ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు ఏపీ మంత్రి రజని ప్రకటించారు.

నేను వెళ్లిపోయాకే తొక్కిసలాట: చంద్రబాబు

సాక్షి, అమరావతి: గుంటూరులో ఉయ్యూరు ఫౌండేషన్ చేపట్టిన పేదలకు కానుకల పంపిణీ కార్యక్రమం నుంచి తాను వెళ్లిపోయాకే తొక్కిసలాట చోటుచేసుకుందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు తెలిపారు. మృతుల కుటుంబాలకు పార్టీ తరఫున రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తామని చెప్పారు. నిబంధనల ప్రకారం అన్ని రకాల అనుమతులు తీసుకున్నాకే కానుకలు, వస్త్రాల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు ఉయ్యూరు ఫౌండేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. ముందుగా టోకెన్లు జారీ చేసిన వారికంటే అదనంగా ప్రజానీకం ఒక్కసారిగా లోపలకు రావటంతో అపశ్రుతి చోటు చేసుకుందని పేర్కొంది. మరణించిన వారికి ఫౌండేషన్ తరఫున ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని వెల్లడించింది.

రూ.300 నాసిరకం కిట్లు

- చీరలు కొన్నది పది వేల మందికే
- టోకెన్లు మాత్రం 30 వేల మందికి

గుంటూరు రూరల్: చంద్రన్న కానుకలంటూ సభా ప్రాంగణం వద్ద పంపిణీ చేసిన కిట్‌లో అరకిలో కందిపప్పు, ప్యాకెట్ పామాయిల్, అరకిలో చింతపండు, అరకిలో గోధుమపిండి, కిలో ఉల్లిపాయలు, అరకిలో బెల్లం, చీర ఉన్నాయి. కిట్‌లో మొత్తం సరుకుల విలువ రూ.300కి మించి ఉండదని వాటిని తీసుకున్న మహిళలు చెబుతున్నారు. పది వేల మందికి మాత్రమే చీరలు కొనుగోలు చేసి గుంటూరులోని నగరం, పరిసర ప్రాంతాల్లో 30 వేల మందికి టోకెన్లు పంపిణీ చేశారు. టోకెన్ల కోసం మహిళల ఆధార్ జిరాక్స్‌లను నిర్వాహకులు తీసుకున్నారు. వారి పేర్లతో టీడీపీ సభ్యత్వాలు నమోదు చేసేందుకే ఆధార్ సేకరించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



గోల్కొండ కిట..కిట..

గోల్కొండ: పర్యాటకులతో గోల్కొండ కోట జనసంద్రమైంది. నూతన సంవత్సరం రోజు కావడంతో కోటకు వేలాదిగా పర్యాటకులు తరలి వచ్చారు. ఉదయం 7 గంటల నుంచే కోట కు దారితీసే రోడ్లు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. టికెట్ కౌంటర్ ముందు వేల సంఖ్యలో గుమికూడారు. గత సంవత్సర కాలంలో ఇంత భారీ సంఖ్యలో పర్యాటకులు రావడం ఇదే తొలి సారని గోల్కొండ కోట హిస్టరీ గైడ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు మహ్మద్ అర్షద్ అన్నారు. ఇదిలా ఉండగా కోట వద్ద టికెట్ తీసుకోవడానికే గంటకు పైనే సమయం పట్టింది.

సినీగేయ రచయిత చంద్రబోస్‌కు సత్కారం

పంజగుట్ట: గేయ రచయిత చంద్రబోస్‌ను సత్కరిస్తున్నామంటే సాక్షాత్తూ సరస్వతీ పుత్రుడిని సత్కరిస్తున్నట్లే అని పలువురు కవులు,రచయితలు అన్నారు. మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చంద్రబోస్‌ను 'సినీ గేయ కౌముది' బిరుదుతో సత్కరించారు. ఇంకా సినీ గేయ రచయిత డాక్టర్ సాదనాల వేంకటస్వామి నాయుడుకు సత్కారం, డాక్టర్ వి.డి.రాజగోపాల్ రచించిన కవితాలహరి పుస్తకావిష్కరణ జరిగాయి.

అన్ని రాష్ట్రాలకు ఆదర్శం జీవన్‌దాన్


మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి


ఆర్గాన్ దోనర్స్ సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

వనస్థలిపురం: అన్ని రాష్ట్రాలకు తెలంగాణ జీవన్‌దాన్ ఆదర్శంగా నిలుస్తుందని, ఇతర రాష్ట్రాలు దీనిని అనుసరిస్తున్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం వనస్థలిపురం చింతలకుంటలోని ఓ కాన్ఫరెన్స్ హాల్‌లో జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అవయవదానం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అవయవదానంపై ప్రజలకు అపోహలు ఉన్నాయన్నారు. అవయవదానం గొప్ప విషయమని, అవయవదానం ద్వారా ఇతరుల ప్రాణాలు కాపాడి తాము చనిపోయినా జీవించే అవకాశం ఉంటుందన్నారు. సకాలంలో ఆర్గాన్స్ దొరక్క పలువురు చిన్న వయస్సులోనే మృత్యువాతపడుతున్నారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న తమ బంధువులకు కిడ్నీలు, గుండె కావాలంటూ నిత్యం తనకు ఫోన్‌లు వస్తాయని ఆయన పేర్కొన్నారు. టెక్నాలజీ ఎంత పెరిగినా ఇంకా కృత్రిమ గుండె తయారు చేయలేమన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి అవయవాలతో 8 మంది ప్రాణాలు కాపాడవచ్చని అన్నారు. బ్రెయిన్ డెడ్ అయినవారి కుటుంబాలను చైతన్యం చేస్తే మరికొందరికి ప్రాణాలు పోయవచ్చన్నారు. గాంధీ ఆసుపత్రిలో రూ. 35 కోట్లతో ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ బ్లాక్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ అంటే ధనికులకు మాత్రమే అందుబాటులో ఉంటుందని చాలామంది అభిప్రాయమని, కానీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గాంధీ, నిమ్స్, ఉస్మానియా ఆసుపత్రుల్లో పైసా ఖర్చులేకుండా అవయవ మార్పిడి చేస్తున్నామన్నారు. నూతన సంవత్సరం వేళ అవయవదానంపై ఇంతమంచి కార్యక్రమం చేపట్టిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభినందనీయులని, ఆయనను ఆదర్శంగా తీసుకుని మిగతా ఎమ్మెల్యేలు ఆర్గాన్ డొనేషన్స్ పెంపునకు కృషి చేయాలని సూచించారు. అవయవాలు కావాలనుకునే వారి వెయిటింగ్ లిస్ట్ 3 వేలకు పైగానే ఉందన్నారు. అవయవదానానికి ముందుకొచ్చిన 250 మందికి సెల్యూట్ చేస్తున్నానన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ అవయవ దానంపై తన తండ్రి జయచంద్రారెడ్డి టస్ట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంత్రి హరీశ్ ఆధ్వర్యంలో పలు ఆసుపత్రుల్లో అవయవ మార్పిడి చికిత్సలు జరుగుతున్నాయన్నారు.

పీవీ చలపతిరావు కన్నుమూత

- అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
- రెండుసార్లు ఎమ్మెల్సీగా, బీజేపీ ఉమ్మడి ఏపీ అధ్యక్షుడిగా సేవలు



సాక్షి, విశాఖపట్నం: భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత, ఆ పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ పీవీ చలపతిరావు (87) కన్నుమూశారు. విశాఖ నగరంలోని పిఠాపురం కాలనీలో ఉంటున్న ఆయన కొంతకాలంగా వృద్ధాప్య, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం తీవ్ర అస్వస్థతకు గురవడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య రాధమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు పి.వి.ఎస్.మాధవ్ ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. 1935 జూన్ 26న జన్మించిన చలపతిరావు పదేళ్ల వయసులోనే ఆర్ఎస్ఎస్‌లో చేరి చురుకైన పాత్ర పోషించారు. 1967 నుంచి విశాఖ ఉక్కు ఉద్యమంలో పాల్గొన్నారు. 1973లో ప్రత్యేకాంధ్ర ఉద్యమానికి నాయకత్వం వహించి పలుమార్లు అరెస్టయ్యారు. ఎమర్జెన్సీ కాలంలో లోక సంఘర్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న ఆయన 19 నెలలు అజ్ఞాతంలో గడిపారు. 1980 నుంచి 1986 వరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించిన ఆయన ఉత్తర సర్కారు జిల్లాల గ్రాడ్యుయేట్ నియోజకవర్గం నుంచి 1974లోను, 1980లోను శాసనమండలికి ఎన్నికయ్యారు. చలపతిరావు పార్థివదేహాన్ని ప్రజలు, పార్టీ శ్రేణుల సందర్శనార్థం విశాఖ పిఠాపురం కాలనీలోని ఆయన స్వగృహంలో ఉంచారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. పీవీ చలపతిరావు మృతి పట్ల హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు బండి సంజయ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు సోము వీర్రాజు, ఎంపీ జీవీఎల్ నరసింహారావు తదితరులు సంతాపం ప్రకటించారు.

'మయూర' సందడి


స్నేహితురాలితో కలిసి సెల్ఫీ దిగుతున్న యువతి


మహిళల కేరింత


మహబూబ్‌నగర్ శివారులోని మయూరీ ఎకో పార్కు వద్ద సందర్శకుల సందడి

నూతన సంవత్సర వేడుకలను జిల్లా ప్రజలు కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువులతో కలిసి ఆనందంగా జరుపుకొన్నారు. ప్రధానంగా జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న మయూరీ ఎకో అర్బన్ పార్కు సందర్శకులతో కిటకిటలాడింది. కొత్త ఏడాది ప్రారంభం.. అందులోనూ ఆదివారం కావడంతో ఉదయాన్నే ఆలయాలకు వెళ్లి.. అటు నుంచి పార్కును సందర్శించేందుకు ఎక్కువ మంది మక్కువ చూపారు. భారీ సంఖ్యలో తరలిరావడంతో పార్కులో ఎక్కడ చూసినా జనం రద్దీ కనిపించింది. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. యువత సైతం సెల్ఫీలు.. పార్కులో గేమ్స్ ఆడుతూ సరదాగా గడిపారు. ఒకరికొకరు న్యూ ఇయర్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

– స్టేషన్ మహబూబ్‌నగర్


ప్రత్యేక బ్యాటరీ వాహనంలో సందర్శకులు


జిప్‌లైన్ సైక్లింగ్ చేస్తున్న యువత


అడ్వెంచర్ గేమ్‌లో యువతి


జారుడుబల్ల వద్ద చిన్నారులు


నీటి కొలనులో..


పార్కులో సందర్శకులు

మల్చింగ్ పద్ధతిలో కూరగాయల సాగు


బీర సాగు

పెద్దకొత్తపల్లి: తనకున్న రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమిలో మల్చింగ్ విధానంతో కూరగాయల సాగు చేపట్టి అధిక లాభాలు పొందుతూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచాడు రైతు రాంచంద్రయ్య. పెద్దకొత్తపల్లి మండలం చెన్నపురావుపల్లి గ్రామానికి చెందిన మేకల రామచంద్రయ్య ఐదేళ్లుగా సాంప్రదాయ వ్యవసాయానికి స్వస్తి పలికి, కూరగాయలు సాగు చేపట్టి లాభాలు పొందుతున్నాడు. బీర, బెండ, టమాట, చిక్కుడు, వంగ, మిరప వంటి కూరగాయలు పండిస్తూ కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. కాకర, బీర కాయలను కొల్లాపూర్ మార్కెట్‌లో కిలో రూ.50 చొప్పున అమ్ముతున్నాడు.

శాస్త్రవేత్తల సూచనలతో..

పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల సూచనలు, సలహాల మేరకు కూరగాయలు సాగు చేసే ముందు బోదెలు ఏర్పాటు చేసుకుని మల్చింగ్, డ్రైటిగేషన్, హైబ్రీడ్ విత్తనాలు ఏర్పాటు చేసుకుని కూరగాయల విత్తనాలు నాటుకున్నాడు. దీనికోసం రూ.లక్ష ఖర్చు అవుతుందని రైతు తెలిపారు. కూరగాయలకు వచ్చే తెగుళ్ల నివారణ కోసం శాస్త్రవేత్తల సలహాల ప్రకారం సమగ్ర సస్యరక్షణ, పోషక యాజమాన్య పద్ధతులు చేపట్టి ఏడాదికి రెండు పంటలు పండిస్తున్నారు. రెండున్నర ఎకరాల్లో రూ.8.5లక్షలు ఆదాయం వచ్చిందని, ఖర్చులు పోగా రూ.4 లక్షల వరకు మిగిలిందని రైతు తెలిపారు. 75 టన్నుల కూరగాయలు పండించినట్లు వివరించారు.

జిల్లా ఉత్తమ రైతు అవార్డు..

తక్కువ పెట్టుబడితో అధికంగా కూరగాయలు పండించినందుకు పాలెం కృషి విజ్ఞాన కేంద్రంలో గత ఏడాది డిసెంబర్ 22న జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని రాంచంద్రయ్యకు జిల్లా ఉత్తమ రైతు అవార్డును పాలెం విశ్వవిద్యాలయం సంచాలకురాలు సుధారాణి అందజేశారు. రాంచంద్రయ్యను చెన్నపురావుపల్లి గ్రామ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ రాంచంద్రయ్య అభినందించారు.


టమాట సాగు


పాలెం విజ్ఞాన కేంద్రంలో జిల్లా ఉత్తమ రైతు అవార్డు అందుకుంటున్న రైతు రాంచంద్రయ్య

అలరించిన అష్టావధానం


వద్దిపర్తి పద్మాకర్‌ను సత్కరిస్తున్న సంస్థ కార్యవర్గ సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకు చెందిన తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ పాలమూరు ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ శివానందాశ్రమంలో త్రిభాషా మహాసహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్ నిర్వహించిన 1247వ అష్టావధానం ఆద్యంతం అలరించింది. కార్యక్రమానికి సంచాలకులుగా అవధాన వికాస పరిషత్ వ్యవస్థాపకులు మరుమాముల దత్తాత్రేయశర్మ, సభాధ్యక్షుడిగా జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా జిల్లాకు చెందిన ప్రముఖ న్యాయవాది మనోహర్‌రెడ్డి, ప్రముఖ జాతీయకవి డాక్టర్ పొద్దుటూరి ఎల్లారెడ్డి, జాతీయ తెలుగు సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నలవోలు నర్సింహారెడ్డి, డాక్టర్ వెల్దండ సత్యనారాయణ, రాధాశ్రీ హాజరయ్యారు. పృచ్ఛకులు అడిగిన సమస్యలను అవధాని వద్దిపర్తి పద్మాకర్ చక్కగా పూరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ సేవలను కొనియాడారు. అనంతరం వద్దిపర్తి పద్మాకర్‌ను కార్యవర్గ సభ్యులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రావూరి వనజ, శాంతారెడ్డి, చుక్కాయపల్లి శ్రీదేవి, మేకల అనురాధ, మూర్తి శ్రీదేవి, డాక్టర్‌బాలస్వామి, గన్నోజు శ్రీనివాసాచారి, పద్మావతి, ప్రాణేష్, రవికుమార్, జేవీ.కుమార్, కష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు


సదస్సులో పాల్గొన్న సొసైటీ సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని రాష్ట్ర బీసీ స్టడీసర్కిల్ మాజీ డైరెక్టర్ మహ్మద్ ఖాజా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఎం ఫంక్షన్‌హాల్‌లో తాజ్‌దక్కన్ ఎడ్యుకేషన్ కల్చరల్ సొసైటీ అధ్యక్షుడు సలీం నవాబ్ అధ్యక్షతన గ్రూప్–4 ఉద్యోగాల పరీక్షపై ఆదివారం యువతకు అవగాహన సదస్సు నిర్వహించారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉర్దూలోనూ స్టడీ మెటీరియల్ ఉందని తెలిపారు. సొసైటీ అధ్యక్షుడు సలీం నవాబ్ మాట్లాడుతూ తమ సొసైటీ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలతోపాటు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలు బాలికలకు టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సులతోపాటు బేసిక్ కంప్యూటర్ కోర్సుపై శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో గ్రూప్–4 పరీక్షపై ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గ్రూప్–4 పరీక్షపై ఈనెల 8వ తేదీన షాసాబ్ గుట్ట చౌరస్తాలోగల అల్‌నూర్ స్కూల్‌లో స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తామని, ప్రతిభ కనబరిచి వారికి ఉచిత శిక్షణ అందజేస్తామని తెలిపారు. గ్రూప్–4 శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులకు ఉచితంగా ఉర్దూ మెటీరియల్ అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు సయ్యద్ ఖలీల్, ఉప కార్యదర్శులు అన్వర్‌పాషా, మహ్మద్ మక్బూల్, అహ్మద్ సనా, కోచింగ్ కోఆర్డినేటర్లు మన్సూర్‌అలీ ఖాన్, తఖీ హుస్సేన్, జమీల్ అహ్మద్‌తోపాటు మైనార్టీ సంఘాల ప్రతినిధులు మోసిన్‌ఖాన్, హాఫిజ్ ఇద్రీస్ పాల్గొన్నారు.

రామన్‌పాడుకు 300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో ఆదివారం పూర్తి నీటిమట్టం 1,021 అడుగుల వరకు నీరు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 150 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 220 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రణీల్‌రెడ్డి తెలియజేశారు.